పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

నస్పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ మండల స్థాయి పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులకు గురువారం సీసీసీ సింగరేణి అతిథి గృహం హాల్‌లో శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) గూడూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిక్షణ సమావేశంలో తహసీల్దార్ సంతోష్ కుమార్, డిప్యూటి తహసీల్దార్ హరిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు చందర్, మాస్టర్ ట్రైనర్స్ సత్తయ్య, భరత్ పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

చెన్నూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్‌లు పేర్కొన్నారు. గురువారం గాంధీభవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సమ్మేళనం విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులందరూ ఏకం కావాలన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ఇది పెద్ద దిక్సూచీ అవుతుందని తెలి పారు ఈ సమ్మేళనానికి ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అతిథిగా హాజరవుతారని తెలిపారు.

హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలి

కాసిపేట, జూలై3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసుకొని అందుబాటులో ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఆజ్మీర పురుషోత్తం నాయక్ అన్నారు. గురువారం మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వపాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరికీ యూనిఫాం, టెక్స్‌బుక్స్ ఇవ్వాలని కోరారు. పాఠశాల ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో సప్తర్ అలీ, జిల్లా క్వాలిటి కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అచ్యుత్, డాక్టర్ దివ్య, ఏపీవో నవీన్, ఏవో ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర పైలం


గ్రామాల్లో ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)


నీటి తొట్టిలోని నీటి పారబోస్తున్న వైద్య సిబ్బంది

- పొంచి ఉన్న సీజనల్ రోగాలు
- అప్రమత్తమైన ఆరోగ్య శాఖ..
- అవసరమైన మందులు అందుబాటులో ఉంచేందుకు కృషి
- ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పకడ్బందీ చర్యలు

నస్పూర్/దండేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : అసలే వర్షాకాలం..పైగా సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య సమస్య కారణంగా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్ సీజనల్ వ్యాధుల వ్యాప్తికి కారణాలు కానున్నాయి. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల వలన వాతావరణంలో భిన్నమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ముందస్తు చర్యలను చేపట్టి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. డెంగీ పరీక్షల కోసం అవసరమైన కిట్స్ కోసం ప్రభుత్వానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇంకా పూర్తి స్థాయిలో కిట్లు రాలేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కిట్లను అత్యవసరమైతే వినియోగిస్తున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కలెక్టర్ కుమార్ దీపక్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. అధికార యంత్రాంగం పారిశుధ్య సమస్యతో పాటు కలుషిత నీటిపై దృష్టి సారించింది.

● పారిశుధ్య సమస్యే కారణం....

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల్లో సీజనల్ వ్యాధులకు పారిశుధ్య సమస్యే కారణమవుతోంది. రోజుల తరబడి ఎక్కడి చెత్త అక్కడే ఉండి పోవడం, డ్రైనేజీలు పూడికతో నిండిపోవడం, మురుగు నీటి గుంతలు నిండిపోవడం వలన దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమలు నివారణకు ఫాగింగ్, మురుగు నీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు మందకొడిగా సాగుతున్నాయి. వ్యాధుల నివారణతో పారిశుధ్య సమస్య పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థలు అధ్వానంగా మారడం, పూడిక తొలగించకపోవడం, ఇళ్ల సమీపంలోనే మురుగు నీటి గుంతలు నిలిచి ఉండడం దోమలు వ్యాప్తికి కారణాలౌవుతున్నాయి. జిల్లాలో గతేడాది మలేరియా-2, డెంగీ-224 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు మలేరియా-1, డెంగీ-1 కేసులు నమోదైయ్యాయి.

● నివారణ చర్యలే ముఖ్యం...

జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య సమస్యను నివారిస్తే వ్యాధులను వ్యాప్తిని నియంత్రించవచ్చు. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల నీరు నిలిచి ఉండడంతో దోమలు వృద్ధి చెంది విజృంభించడం మూలంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో పరిసర ప్రాంతాలు పరిశుభ్రతను పాటిస్తే వ్యాధుల సమస్యను అరికట్టే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో, పట్టణాల్లో ఫాగింగ్ సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● దోమల నివారణ...

దోమ కాటుకు గురి కాకుండా ఇంటిలో దోమ తెరలు, ఇంటి కిటికిలకు జాలీలు, దోమలను చంపే స్ప్రేలు, వివిధ రసాయనాలతో పొగ పెట్టడం లాంటివి చేయాల్సి ఉంటుంది. ఇళ్ల పరిసరాల్లో నీళ్ల కుండీలు, బావులు, నీటి గుంతలు ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలి. నీటి ఆవాసాలు, కుండీల్లో దోమలు ఆవాసాలు ఏర్పాటు.. (తరువాయి 6లో)

కమిషనరేట్‌కు జాతీయ స్థాయిలో పేరు తేవాలి

● సీపీ అంబర్ కిషోర్‌ఝా


జాగిలాల పనితీరును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

మంచిర్యాలక్రైం, జూలై3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయస్థాయిలో రామగుండం కమిషనరేట్‌కు కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. పోలీసు కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో కాళేశ్వరం జోన్ స్థాయి పోలీసు డ్యూటీ మీట్ 2వ రోజు పలు అంశాలపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆర్మ్‌డ్ రిజర్వు విభాగాలైన డాగ్‌స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీం పని తీరును ఆయన పరిశీలించారు. జాగిలాలు నేర స్థలంలో బాంబులను, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను ఏ విధంగా గుర్తిస్తాయని, డాగ్‌హ్యాండ్లర్ ప్రత్యేక్షంగా చూపించారు. అనుమానాస్పదమైన, ప్రమాదకరమైన ఇనుప వస్తువులను ఏ విధంగా నివృత్తి చేయాలనే దానిపై సిబ్బందికి చూపించారు. ప్రతిభ, సామర్థ్యం ఆధారంగా రాష్ట్రస్థాయిలో వరంగల్ పోలీసు కమిషన రేట్‌లో నిర్వహించబడే తెలంగాణ రాష్ట్ర 2వ పోలీసు డ్యూటీ మీట్‌లో ఎంపిక చేశారు. ఎంపికైన కాళేశ్వరం జోన్ తరుపున, రాష్ట్ర తరుపున ప్రాతినిధ్యం వహించి కమిషనరేట్‌కు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేశ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

● మంచిర్యాల ఆర్డీవో గూడూరి శ్రీనివాస్‌రావు

లక్షెట్టిపేట, జులై 3(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిది ఓటరుగా నమోదు అయ్యేలా చూడాల్సిన బాధ్యత బీఎల్‌వోలపైనే ఉంటుందని మంచిర్యాల రెవెన్యూ డివిజన్ అధికారి గూడూరి శ్రీనివాస్ రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో గురువారం ఓటరు నమోదుపై బీఎల్‌వోలతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్క బీఎల్‌వో తమ ఏరియాలో ఇంటింటికీ తిరుగుతూ వయస్సు నిండిని ప్రతీ ఒక్కరి ఓటును నమోదు చేయించాలన్నారు. ఓటరు నమోదు చేసుకోవడం తప్పనిసరి అని వాళ్లకు అవగాహన కూడా కల్పించాలని ఓటు అనేది మనకు రాజ్యాంగం కల్పించిన ప్రథమ హక్కు అన్న విషయం తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని దాని గురించి ఇంటింటి సర్వే చేస్తు అవగాహన కల్పించడంతో పాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో లక్షెట్టిపేట తహసీల్దార్ దిలీప్‌కుమార్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వినియోగదారులకు నిరంతర విద్యుత్


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

చెన్నూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆపరేషన్ ఎస్ఈ ఉత్తమ్ కోరారు. గురువారం ఆయన పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయన వెంట ఎంఆర్‌టీ డీఈ రాజన్న, ఏడీఈ బాలకృష్ణ, ఏఈ శ్రీనివాస్, ఏఏవో శ్రీనివాస్ ఉన్నారు.

సెప్టెంబరు 30 వరకు కవ్వాల్ టైగర్ రిజర్వ్ మూసివేత

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పులుల సంరక్షణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంతో పాటు పులుల సంరక్షణకు సెప్టెంబరు 30వ తేదీ వరకు కవ్వాల్ టైగర్ రిజర్వ్ మూసివేస్తున్నామని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాజెక్టు క్షేత్ర సంచాలకులు, అటవీ సంరక్షణ అధికారి శాంతారామ్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో పులుల ఆవాసాలు, పర్యావరణ వ్యవస్థ, భద్రత సమస్యలు, పునరుత్పత్తి, వన్యప్రాణుల సంరక్షణ దృష్ట్యా మూసివేస్తున్నామన్నారు. వర్షాకాలంలో అటవీ ప్రాంతంలో ఏర్పడే ఇబ్బందులు, అటవీ సిబ్బందికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి తిరిగి ప్రారంభిస్తామన్నారు. వన్య ప్రాణుల ప్రేమికులు, పర్యాటకులు వన్యప్రాణుల సంరక్షణకు కోసం చేపట్టిన మూసివేతకు సహకరించాలన్నారు.

భీమన్న గుడిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

దండేపల్లి జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలంగ దూడలో ఆదివాసుల కులదైవమైన భీమన్న దేవుని ఆలయాన్ని కూల్చిన ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి సేన జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, రాజ్ గోండ్ సేవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెంద్రం నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం దండేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అటవీ శాఖ అధికారులు ఆదివాసి గిరిజనుపై కక్ష కట్టుకుని ఈనెల 2 బుధవారంరోజున జన్నారం వచ్చిన కోలంగూడ చెందిన ఆత్రం రాజు, వారి ఇద్దరు కుమారులైన ఆత్రం రవికుమార్, ఆత్రం సుదాకర్‌లను అటవీ శాఖ అధికారులు అక్రమంగా వారి అదుపులో తీసుకోని అక్రమంగా అరెస్టుచేసి లక్షెట్టిపేటకోర్టుకు హాజరుపర్చి జైల్‌కు పంపించడం హేయమైన చర్య అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వాళ్ల వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి సేననాయకులు సంతోష్, భీంరావు, తిరుపతి, భగవంత్‌రావు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు...

● కాంగ్రెస్ నాయకుడు ధర్ని మధుకర్

నస్పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బలంగా ఉన్న ప్రాంతాల నాయకులపై సత్యనారాయణ చేసిన అసత్య ఆరోపణలు సహించేది లేదని రాంనగర్ ఏరియా 21వ వార్డు ఇన్‌చార్జి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధర్ని మధుకర్ అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను ఎక్కడ కూడా భూ కబ్జాలకు పాల్పడలేదని, సీతారాంపల్లి శివారులో పూజారి వద్ద నుంచి కొనుగోలు చేసానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నమన్నారు. ఆయా వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న చోట ఆ ప్రాంత నేతలను బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు సంపత్‌రెడ్డి, కొండ్ర లింగయ్య, కలీద్, తోట శ్రీనివాస్, భూపతి శ్రీనివాస్, కలీద్, చంద్రయ్య, రెంక రవి, రొడ్డ రాజేశం, విజయ లక్ష్మి, పద్మ, పోతురాజుల రమేష్ పాల్గొన్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ

హాజీపూర్, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం గ్రామంలో గురువారం జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా కంది విత్తనాలు పంపిణీ చేశారు. వివిధ కందిరకాలకు చెందిన 4, 10కిలోల కంది విత్తనాల బ్యాగులను రైతులకు అందజేశారు. రైతులు సాగులో అంతర పంటగా కంది దినుసుల సాగు చేయాలని కంది విత్తనాలను పొలంగట్లపై వేసి అధిక లాభాలు పొందాలని ఏడీఏ అనిత, ఏవో క్రిష్ణలు రైతులకు వివరించారు. ద్రవ రూప నానో యూరియా వినియోగం ఎరువుల యాజమాన్యం పద్ధతులు ఎగుళ్ల నివారణకై రైతులకు అవగాహన కల్పించారు.

వానాకాలం సాగుకు నీటిని విడుదల చేయాలి

భీమారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టు మండలంలోని వ్యవసాయ పంటలకు ముఖ్యంగా వరి పంటకు జీవనాధారం. గత రబీ సీజన్‌లో ఆయకట్టు కింది రైతులకు నీటిని ఆలస్యంగా విడుదల చేయడం వల్ల పంట చేతికి వచ్చే వరకు ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ సంవత్సరమైనా వానాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఇప్పటికీ నీటిని విడుదల చేయలేదు. ప్రతి సంవత్సరం గొల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కింది రైతులకు అధికారులు నీటిని సీజన్ పారరంభమైన తర్వాత ఆలస్యంగా విడుదల చేయడం వల్ల వరినాట్లు సైతం ఆలస్యంగా వేయడంతో పంటచేతికి వచ్చే సరికి చీడపీడలు, పంటలకు అనేక తెగుళ్ల వచ్చి ఇబ్బందులు పడుతున్నా మని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికే కురిసిన వానలతో ప్రాజెక్టులో ఇప్పటికే కొంత నీరు వచ్చి చేరింది. పూర్తిగా నిండితే అలుగు పడుతుందని, ప్రాజెక్టు పూర్తిగా నిండిన తర్వాత నీటిని వృధాగా అలుగు ద్వారా పంపించడం కంటే ప్రాజెక్టులో ఉన్న నీటిని ముందు విడుదల చేస్తే పంట పొలాలకు మళ్లించుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు

చెన్నూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల సాగుతో రైతులు అధికలాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ ప్రసాద్ కోరారు. గురువారం వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు ఎక్కువగా వరి, పత్తి పంట లపైనే ఆసక్తి చూపుతున్నారని, అలా కాకుండా చిరుధాన్యాలైన పప్పుదినుసులను సాగుచేస్తే పంట మార్పిడితో పాటు అధిక లాభాలు పొంద వచ్చన్నారు. అనంతరం రైతులకు చిరుధాన్యాల ప్యాకెట్ల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్లంరాంరెడ్డి, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

నీటి వనరుల గణనను సమర్థవంతంగా చేపట్టాలి


శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పూర్ణచంద్రరావు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : నీటి వనరుల గణను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల ప్రణాళిక, గణాంక అధికారులకు 7వ చిన్న తరహా, 2వ నీటివనరుల గణనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరుల గణనపై మొబైల్ యాప్ ద్వారా గణనచేసే విధానంపై అధికారులకు వివరించామన్నారు. ఈ శిక్షణలో జిల్లాలోని అన్ని వనరులను గ్రామాల వారీగా, వనరుల వారీగా గణన చేసేందుకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన ఉప గణాంక అధికారి ద్వారా శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

బెల్లంపల్లి, జూలై3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న కార్మికసంఘాల సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నర్సయ్య, పట్టణ కార్యదర్శి రాజమౌళి అన్నారు. గురువారం సీపీఐ పట్టణ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందన్నారు. 44కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల కుటుంబాల్లో నిప్పులు పోస్తుందన్నారు. సమ్మెలో భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తిలక్, లక్ష్మీనారాయణ, రత్నంరాజం, రాంచందర్, రాజేందర్, రాజమల్లు, శంకరయ్యలు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : కార్మిక చట్టాలను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వం ఆపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. గురువారం మంచిర్యాలలోని సీపీఐ కార్యాలయంలో వామ పక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాల్‌కుమార్, దేవ రాజు, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పేర్కొన్నారు. గురువారం డీఎంఅండ్‌హెచ్‌వో డీపై సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను అమలు చేయడానికి కుట్రలు చేస్తుందన్నారు. నాయకులు బాపు, కళావతి, భాగ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యాబోధన

● డీఈవో యాదయ్య


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మందమర్రిటౌన్, జూలై3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారని జిల్లా విద్యాధికారి యాదయ్య తెలిపారు. పట్టణంలోని ఒర్రగడ్డ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం హైదరాబాద్‌కు చెందిన సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెంచీల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోటు బుక్కు ఉచితంగా అందజేస్తూ విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ బాధ్యతలు స్వీకరించిన తరువాత పాఠశాల రూపురేఖలు మారిపోయాయన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడ పెద్ద మొత్తంలో పెరిగిందన్నారు. మందమర్రి జీఎం దేవేందర్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు మాట్లాడుతూ విద్యతోనే విజ్ఞానం పెరగడంతో పాటు ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయిలో ఉంటాడని పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనం లాంటి పథకం కూడ విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు బ్లూడాన్ ఆర్గనైజేషన్ వారు బెంచీలు అందజేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం బెంచీలను పాఠశాలకు సంస్థ నిర్వాహకులు విదుమౌళి, శ్రీకాంత్, స్థానిక ఎంఈవో దత్తుమూర్తి పంపిణీ చేశారు. కాగా ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

కన్నెపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని డీఈవో యాదయ్య సూచించారు. గురువారం మండలంలోని ఐతపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందాయా అని ఉపాధ్యాయులను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా పాఠాలను బోధించాలన్నారు. మెను ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గప్రసాద్


వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ దుర్గా ప్రసాద్

బెల్లంపల్లి,జూలై3(ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటి డైరెక్టర్ సిహెచ్ దుర్గప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని బాలుర, కళాశాల వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని గదులతో పాటు వంట గదిని, పరిసరప్రాంతాన్ని నిత్యావసర సరుకులను రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడని సమతుల్యమైన భోజనం అందించాలని, ఎలాంటి లోపం లేకుండా వంట సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈకార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ : పట్టణంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహాలను గురువారం జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ ఈడీ చాతరాజుల దుర్గా ప్రసాద్ తనిఖీ చేశారు. పాత బస్టాండ్‌లోని బాలికల కళాశాల వసతి గృహంతో పాటు భాగ్యనగర్ కాలనీలోని బాలుర వసతి గృహంతో పాటు శ్రీపతి నగర్‌లోని సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం మెను ప్రకారం అందిస్తున్నారా అని అడిగారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులను, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎఎస్‌వో రవీందర్, వార్డెన్‌లు తిరుమల, కిశోర్, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పౌనూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. తాజా కూరగాయాలతో భోజనం తయారు చేయాలని, శుద్ధమైన నీటిని అందించాలన్నారు. బడిబయట పిల్లలు, మధ్యలో బడిమానేసిన పిల్లలను గుర్తించి వారు పాఠశాలలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అంగ న్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు కొలతలు స్వయంగా పరిశీలించారు. శివ్వారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాలలను పరిశీలించి ఉపా ధ్యాయులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో కొనసాగు తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీ లించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డీసీఎంఎల్ ఫర్మార్ సర్వీసు సెంటర్‌ను సందర్శించి ఎరువులు, విత్తనాల స్టాకు నిల్వలు, రిజిరష్టర్‌లను పరిశీలించారు. అనంతరం గంగిపెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భూ సమస్యలపై ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు ఉన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేయాలి

భీమారం: రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హత గల వారికి కార్డులను జారీ చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తుల ప్రక్రియ, రిజిష్టర్‌లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డుల కోసం అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి కార్డులను జారీ చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. దాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, మండల పంచాయతీ అధికారి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ట్రాక్టర్ బోల్తా

రెబ్బెన, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం దేవులగూడ సమీపంలో గురువారం ఇసుక ట్రాక్టర్ డివైడర్‌ని ఢీ కొని బోల్తా పడింది. ఈ సంఘటనలో పులికుంటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దుర్గం మారుతీ(25) తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం లేతన్‌గూడ వాగు నుంచి ఇసుకను గోలేటికి తరలిస్తున్న క్రమంలో డ్రైవర్ అజాగ్రత్తగా, అతి వేగతంగా వచ్చి డివైడర్‌ను ఢీ కొట్టినట్లు తెలిపారు. దాంతో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే లైసెన్సులు రద్దు

కెరమెరి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే దుకాణం లైసెన్సులు రద్దు చేస్తామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని హకా ఎరువుల దుకాణం, అయ్యప్ప ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ భూమేశ్వర్, ప్రత్యేకాధికారి వెంకట్, ఏఓ యుగేందర్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

చింతలమానేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ పత్తివిత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ చటోత్ మనోహర్ హెచ్చరించారు. మండలంలోని రవీంద్రనగర్, చింతలమానేపల్లి, తదితర గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో కార్తైషా, ఏఈఓలు వెంకటేష్, జ్ఞానేశ్వర్, తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కౌటాల, జూలై 3(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఏఏ ఎరువులు ఎంత మేరకు వచ్చాయో వాటి వివరాలను తెలుసుకున్నారు. ఎవరైనా డీలర్ అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి ప్రేమలత అన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

రెబ్బెన, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు గురువారం రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం వద్దకు ఉదయం పూట యూరియా కోసం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 11 గంటలు అయినప్పటికీ అధికారులు అందుబాటులో లేకపోవటంతో రైతులు రోడ్డుపై బైఠాయించారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై చంద్రశేఖర్ చేరుకొని రైతులను సముదాయించటంతో ఆందోళన విరమించారు. అనంతరం ఎస్సై అధికారులను పిలిపించి ఎరువులను పంపిణీ చేశారు.

హైదరాబాద్ తరలిన నాయకులు

సిర్పూర్(టి), జూలై 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో శుక్రవారం జరిగే కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గె సమావేశానికి గురువారం సిర్పూర్(టి) మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో సోహెల్ అహ్మద్, తులసీరాం, అబ్దుల్ అకీల్ ఉన్నారు.

కోర్టు ధిక్కరణ కేసులో ఫర్నీచర్ జప్తు

జన్నారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కోర్టు దిక్కరణ కేసులో అటవీడివిజన్ కార్యాలయంలోని సామగ్రితో పాటు తాళ్లపేట రేంజ్ కార్యాలయంలోని సామగ్రిని గురువారం కోర్టు సిబ్బంది జప్తు చేశారు. మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దర్శనాల రాజం 1984 నుంచి తాళ్లపేట రేంజ్ పరిధిలో ఎనిమల్ ట్రాకర్‌గా విధులు నిర్వహిస్తుండగా 1997లో అటవీశాఖ అధికారులు సమాచారం ఇవ్వకుండా విధుల నుంచి తొలగించారు. దీంతో రాజం గోదావరిఖనిలోని లేబర్‌కోర్టును ఆశ్రయించగా రాజంను విధుల్లోకి తీసుకోవాలని కోర్టు డీఎఫ్‌వోను ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో 2015లో విధుల్లోకి తీసుకున్న అటవీ అధికారులు 2016లో మళ్లీ ఆయనను తొలగించారు.

మరోసారి బాధితుడు రాజం లేబర్‌కో ర్టులో కేసు వేయడంతో విధుల్లో తీసుకోవడమే కాకుండా 15,89,700 వేతనం కట్టి ఇవ్వాలని 2017లో లేబర్ కోర్టు తీర్పునిచ్చింది. అప్పటి నుంచి కోర్టు ఆదేశాలను అటవీశాఖ అధికారులు పట్టిం చుకోకపోవడంతో ఆరునెలల క్రితం జన్నారం ఎఫ్‌డీవో ఆఫీసుతోపాటు తాళ్లపేట రేంజ్ కార్యాలయంలోని ఫర్నీచర్‌ను, కంప్యూటర్లు, బ్యాటరీలతో సహా అన్ని వస్తువులను కోర్టు జప్తు చేసింది. ఆరు నెలల తరువాత మరోసారి గోదావరిఖని లేబర్‌కోర్టు ఆదేశం మేరకు లక్షెట్టిపేట మున్సిఫ్ కోర్టు ఫీల్డ్ అధికారులు రజిత్ కుమార్, ఎండీ యూసుఫ్, ప్రాసెస్ సర్వర్, సంధ్యరాణీలు గురువారం ఎఫ్‌డీవో కార్యాలయంలోని కంప్యూటర్లు, బ్యాటరీలు, బీరువాలు, కుర్చీలతో పాటు మొదలైన సామగ్రిని లక్షెట్టిపేట కోర్టుకు తరలించారు. ఆరు నెలల్లోపు ఎఫ్‌డీవో, రేంజ్ కార్యాలయ జప్తు చేయడం ఇది రెండోసారి. అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా కనిపించడం చర్చానీయాంశంగా మారింది.



ఫర్నీచర్ జప్తు చేస్తున్న అధికారులు

ప్రజాఫ్రంట్ పేరుతో వెలిసిన పోస్టర్లు

కోటపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంచపల్లి, ఆల్గామ గ్రామాల్లో బుధవారం రాత్రి మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో వాల్ పోస్టర్లు వెలిశాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లను అంటించినట్లు తెలుస్తుంది. ఆయుధాలు వీడండి జన జీవన స్రవంతిలోకి రండి, మీ మేధస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగిం చండి అంటూ పోస్టర్లలో ఉంది. పోస్టర్లను గురువారం ఎస్ఐ రాజేందర్ పరిశీ లించారు.

కౌటాల: మావోయిస్టు ఆత్మ పరిరక్షణ కమిటీ పేరిట కౌటాల ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయానికి పోస్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు అంటిం చారు. సిద్ధాంతం కోసం అడవి పాలైన అ న్నల్లారా..! అక్కల్లారా..! ఆయుధాలు వీడండి. జనజీవన స్రవంతిలోకి రండి అంటూ పోస్టర్ల సారాంశం ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

బహుజన రాజ్యమే లక్ష్యంగా పోరాడాలి

మందమర్రిటౌన్, జూలై 3 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రంలో బహుజనుల రాజ్యమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. పలువురు బీఎస్పీ పార్టీలో చేరారు. గాజుల శంకర్, ఎండీ మతీన్‌ఖాన్, రహీం బాబ, సర్వేఆలం పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రధాని ధ్యేయం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్ర జ్యోతి) : దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మంచిర్యాల పట్టణంలోని దుకాణాలకు వెళ్లి వ్యాపారులను కలిసి ప్రధాని మోదీ చేసిన అబివృద్ధి సంక్షేమపథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రాంచందర్‌రావుపై వ్యాఖ్యలు సరికాదు

జైపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా బాధిస్తున్నాయని జైపూర్ బీజేవైఎం మండల అధ్యక్షుడు పల్లికొండ వెంకటేష్ పేర్కొన్నారు. రాంచందర్‌రావు ఏబీవీపీ నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అలాంటి నేతపై వ్యక్తిగత విమర్శలు మాని గౌరవించాలన్నారు.

వైద్య పరీక్షలు

బెల్లంపల్లి: సాంఘికసంక్షేమ కాసిపేట గురుకులంలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు యశ్వంత్ చంద్ర, వంశీ, అంజయ్యతో పాటు లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు అరుణాసుందరి, సభ్యులు ఆదర్శ్‌వర్ధన్‌రాజు, ఎర్ర సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

మందమర్రిరూరల్: మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన భుక్య అలివేణి, కున్‌సోత్ సత్తవ్వ అనే మహిళ రైతులకు గురువారం వరి కేఎన్ఎం 7715, కేఎన్ఎం 12510 రకాల విత్తనాలను వంద శాతం సబ్సిడీపై వ్యవసాయ సంచాలకులు ప్రసాద్ అందజేశారు.

సంక్షిప్త సమాచారం

టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరం

చెన్నూరు : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో గురువారం అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అబియాన్ శిబిరాన్ని నిర్వహించారు. 106 మందికి వైద్య పరీక్షలు చేయగా, 36 మందికి తెడమ పరీక్షలు, 31 మందికి ఎక్స్‌రే తీశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

మందమర్రిరూరల్ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవా లని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వ ర్ గౌడ్ అన్నారు. గురువారం అందుగు లపేట ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బీజేపీ నాయకుడు దార రవిసాగర్ ఆధ్వర్యంలో నోటు బుక్కులు, పెన్నులు, బ్యాగులు పంపిణీ చేశారు. అందుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తాం

భీమారం: నర్సింగాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 11/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని విద్యుత్ ఎస్ఈ ఉత్తమ్ అన్నారు. గురువారం నర్సింగాపూర్‌లోని సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ ఎంఆర్‌టీ రాజన్న, ఏడీ బాలకృష్ణ, కనస్ట్రక్షన్ ఏడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టిన ఆటో

హాజీపూర్ : మండలంలోని దొనబండ గ్రామ శివారు జాతీయ రహదారి 63పై గురువారం రాత్రి ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొనగా ఆటో పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక ఉన్న మరో ఇద్దరికి కూడ తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేర వార్తలు

మద్యం మత్తులో భార్యను హత్యచేసిన భర్త

కన్నెపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున మద్యం మత్తులో తులసి (35)అనే మహిళను ఆమె భర్త ముడిమడుగుల తిరుపతి గొడ్డలితో నరికి హతమార్చాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి గ్రామానికి చెందిన తిరుపతి కుమరంభీం జిల్లా దహెగాం మండలం బమన్‌నగర్ గ్రామానికి చెందిన తులసిని 14 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. కొంత కాలంగా తిరుపతి మద్యానికి బానిసయ్యాడు. అప్పటి నుంచి భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ దంపతులిద్దరూ గొడవ పడేవారు. బుధవారం రాత్రి తాగొచ్చి గొడవపడ్డాడు. గురువారం తెల్లవారుజామున తులసి మంచంపై పడుకుని ఉండగా గొడ్డలితో ఆమె మెడపై నరికి హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం స్థానికులు గమనించేసరికి తులసి రక్తపుమడుగులో పడిఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. మృతురాలు తులసి తండ్రి దుర్కె శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



మంచిర్యాలక్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఒడ్డెరకాలనీకి చెందిన గండికోట ఉపేందర్(19) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం ఉపేందర్ మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఇంటి పెరుడులోని చెట్టుకు ఉరివేసుకొని గురువారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. ఉపేందర్ కూలీ పని చేసుకుంటున్నాడు. గతంలో పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మృతుడి అమ్మమ్మ సూర రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తిరుపతి(ఫైల్)

బెల్లంపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన కందుకూరి తిరుపతి(47) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి పరిచయం ఉన్న వ్యక్తి ఇంటికి వెళ్లి బుధవారం ఇంటి పై కప్పుపై టార్పాలిన్ సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు మంచిర్యాల ప్రభుత్వ తర లించగా వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు కూలీ పని చేస్తూ జీవనం సాగించేవాడు.దీంతో మృతుడి నేత్రాలను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు



మంటలను అదుపుచేస్తున్న ఎస్సై సురేష్

లక్షెట్టిపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని అంద్రబోర్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం ఒక ఇంట్లో ఫ్రిజ్ షాట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించింది. మందమర్రి ఏడీసీసీ బ్యాంక్‌లో పని చేసే గుండపనేని అశ్విన్‌కుమార్ ఉదయం తన ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లాడు. ఇంట్లో ఫ్రిజ్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో నుంచి దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు గమనించి 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ వెంటనే సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని వ్యవహరించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లో సిలిండర్ ఉండటంతో స్థానికులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ఎస్సై ధైర్యంతో వెళ్లి తలుపులు పగులగొట్టి నీళ్ల చల్లుతూ మంటలను అదుపు చేశారు. కాసేపటి తర్వాత ఫైర్ ఇంజన్లు రావడంతో మొత్తం మంటలను అదుపుచేయగలిగారు. సకాలంలో పోలీసులు స్పందించి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రెండు లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు అశ్విన్ తెలిపారు. మంచిర్యాల డీఎఫ్‌వో భగవాన్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ రమేష్‌బాబు బాధితుడి వద్ద నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆవులమందపై చిరుతపులి దాడి - లేగదూడ మృతి

కాసిపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): దేవాపూర్ అటవీ సెక్షన్ పరిధిలోని మద్దిమాడ బీట్ 534 కంపార్ట్‌మెంట్‌లో బుధవారం సాయంత్రం చిరుతపులి ఆవుల మందపై దాడి చేసింది. ఈ ఘటనలో కొత్తగడ్‌పూర్‌కు చెందిన రైతు ఆడె జంగుకు చెందిన లేగదూడ మృతి చెందినట్లు ఫారెస్టు బీట్ ఆఫీసర్ రజిని తెలిపారు. గురువారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించగా లేగదూడ కళేబరాన్ని కొంతదూరం లాక్కెళ్లినట్లు ఆనవాల్లు గుర్తించామన్నారు. పరిసర ప్రాంతాల్లోని పాదముద్రల ఆధారంగా చిరుతపులి దాడిచేసినట్లు గుర్తించామని తెలిపారు. లేగదూడకు పశు వైద్యాధికారులచే పంచనామా నిర్వహించిన అనంతరం నివేదికను అటవీశాఖ ఉన్న తాధికారులకు పంపుతామన్నారు. అలాగే దేవాపూర్ అటవీసెక్షన్ పరిధిలో చిరుత పులుల సంచారం విపరీతంగా పెరిగిపోయింది. కాబట్టి పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలు అటవీలోపలికి వెళ్లవద్దని హెచ్చరించారు.

గట్రావ్‌పల్లిలో లేగదూడపై చిరుత దాడి...

గట్రావ్‌పల్లి అటవీశివారు ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఆవులమందపై చిరుతపులి దాడి చేసినట్లు బాధిత రైతు ఆత్రం జంగు, పశువుల కాపరి జుగునక దశ్వంత్‌రావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆవులమందను పశువుల కాపరి ఇంటికి తోలుకస్తుండగా కోమటిగోడల సమీపంలోకి రాగానే ఆవుల మంద ఒక్కసారిగా చెల్లచెదురైంది. చిరుతపులి లేగదూడ వెంటపడి పంజా విసిరింది. కిందపడిన లేగదూడ అరుపులకు ఆవులన్నీ గుంపులుగా చేరి చిరుతపులిపై దాడి చేశాయన్నారు. ఇదే అదునుగా భావించిన పశువుల కాపరి దశ్వంత్‌రావు చిరుత లేగదూడను వదిలి పారిపోయినట్లు తెలిపారు. చిరుతపులులు గ్రామాల సమీపంలోకి రావడం పట్ల అటవీశివారు ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అడవి దగ్గర పత్తిసాగు చేస్తున్న రైతులు ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

చింతలమానేపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రన్‌వెల్లి, లంబాడీహెట్టిలో 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. గురువారం రెండు నిర్వహించి పది లీటర్ల నాటు సారాతో పాటు నాటు సారాకు ఉపయోగించే 1800 కిలోల పటిక, 100 కిలోల బెల్లంను, ద్విచక్ర వాహనం, వ్యాన్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి రన్‌వెల్లికి చెందిన జాటోత్ నారిబాయి, లంబాడీహెట్టికి చెందిన ఆజ్మీర శ్యాంలాల్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన ముడిసరకులు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో ఎస్సైలు లోభానంద్, సురేష్, సిబ్బంది మల్లేష్, సతీష్ పాల్గొన్నారు.



ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల హక్కుల సాధన



యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కాంపెల్లి సమ్మయ్య

మందమర్రిటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టింది ఐఎన్‌టీయూసీ యూనియన్ మాత్రమేనని యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. గురువారం ఏరియాలోని కేకే ఓసీపీ వద్ద కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ నేతృత్వంలో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫమలైందన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్ గెలవడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మైన్ కమిటీ సభ్యురాలు శరణ్య ఐఎన్‌టీయూసీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్నకొండ ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మందమర్రిటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు రాంశెట్టి నరేందర్, కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్ పేర్కొన్నారు. గురువారం కేకే 5 గనిపై సమ్మె పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్రప్రభుత్వం బొగ్గు పరిశ్రమలు లేకుండా చేసే కుట్రలకు పాల్పడుతోందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చి కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. ఈ విధానాలను తిప్పి కొట్టేందుకు కార్మికులందరు సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సదయ్య, సూర్యనారాయణ, రాజేశం, ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బోనాల వేడుక

లక్షెట్టిపేట, జులై 3(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం హన్మంత్‌పల్లి గ్రామంలో గురువారం ఆశాఢ మాసం పురష్కరించుకుని గ్రామ ప్రజలు ఐక్యతతో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. మహిళలు ఉపవా సాలతో బోనాలు వండి భాజ భజంత్రీలతో ఊరేగింపుగా తలపై బోనాలతో పోచమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

దండేపల్లి : గ్రామస్థుల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పోచమ్మతల్లి, పెద్దమ్మ, పెద్దిరాజు, పొలిమేరదేవతలతో పాటు చిన్నయ్యపెద్దయ్య స్వాములకు పంబాలి పూజలతో మంత్రోచ్చరణ నడుమ పూజలు చేశారు. కాగా పంబాలి పూజలు గ్రామదేవతలను కొలిస్తూ ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం మేకలు, కోళ్లలను గ్రామ దేవతలకు బలించారు.

చెన్నూరు : పంటలు బాగా పండాలని, ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ మండలంలోని కాచన్‌పల్లి గ్రామంలో గురువారం గ్రామస్తులు ఊరి పోచమ్మకు మొక్కులు చెల్లించారు.

మందమర్రిరూరల్ : మండలంలోని బొక్కల గుట్టలోని గాంధారి మైసమ్మకు గురువారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూజిస్తూ మొక్కులు చెల్లించుకుంటారు. వానలు కురిసి పంటలు బాగా పండాలంటూ వేడుకున్నారు.

వ్యాధుల కాలం..జర పైలం

(5వ పేజీ తరువాయి)

చేసుకుని గుడ్లు పెట్టుతాయి. అలాంటి ఆవాసాలు ఇంటి పరిసరాల్లో లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వారంలో ఒక రోజు డ్రై డేను పాటించాలి. ఇంటిపై ట్యాంకులు, పైపులు, ఇనుప డబ్బాలల్లో దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి.

అప్రమత్తంగా ఉన్నాం



జిల్లా కీటక జనిత నియంత్రణ అధికారి డాక్టర్ అనిత

జిలాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలను చేపట్టాం. ప్రతి శుక్రవారం అన్ని శాఖల అధికారుల, సిబ్బందితో సమన్వయంతో డ్రైడే నిర్వహిస్తున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా అన్ని ప్రాంతాలపై దృష్టి సారించాము. సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రభావిత ప్రాంతాలను గుర్తించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం. ముఖ్యంగా హాస్టల్స్‌లో రాపిడ్ రెస్పాన్స్ బృందాలచే తనిఖీలు చేస్తారు. పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చాం. ప్రస్తుతం సరిపడే డెంగీ కిట్లు ఉన్నాయి. ఇంకా కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

సమష్టి కృషితోనే జాతీయస్థాయి ర్యాంకు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తిర్యాణి అస్పిరేషనల్ బ్లాక్ అందరి సమష్టి కృషితోనే జాతీయ స్థాయిలో ఐదో ర్యాంకు సాధించినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లాలోని తిర్యాణి అస్పిరేషనల్ బ్లాక్ జాతీయ స్థాయిలో ఐదో ర్యాంకు, దక్షిణాధి రాష్ట్రాల్లో మొదటి ర్యాంకు సాధించినందుకు తిర్యాణి మండలంలోని అన్ని శాఖల అధికారులు, జిల్లా అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వాహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాంక్ రావడానికి పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఆయాల కృషి ఎంతగానో ఉందని, అందరి సమష్టి కృషితో ఈ స్థానం సాధ్యమైందని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అస్పిరేషనల్ బ్లాక్ కింద వెనుబడిన ప్రాంతమైన తిర్యాణి మండలాన్ని ఎంపిక చేశారన్నారు. దీని ద్వారా విద్యా, వైద్యం, వ్యవసాయం, మహిళా సంఘాలు, మహిళల రివాల్వింగ్ ఫండ్, గర్భిణులకు పోషక ఆహారం అందించడం, శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించడం, విద్యా రంగం అభివృద్ధి, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, భూదార్ కార్డుల జారీ వంటి అంశాలపై 100 శాతం అభివృద్ధి సాధించే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, డీపీవో భిక్షపతి, ఎంపీడీవో మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా, తిర్యాణి మండల అధికారులతో కలెక్టర్ వెంకటేష్ దోత్రే


shanthi TALKIES
MYTHRI MOVIE DISTRIBUTORS LLP
RELEASING TODAY
SIDDHARTH
SARATH KUMAR
3BHK
'Every Ordinary Family has an Extraordinary Story'
WRITER - DIRECTOR SRI GANESH
PRODUCED BY ARUN VISWA
PRODUCED BY ARUN VISWA


ప్రపంచవ్యాప్తంగా
నేడే
విడుదల
జురాసిక్ వరల్డ్
రీబర్త్
IN CINEMAS JULY 4
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU
IN 3D
UNIVERSAL


ANIL SUNKARA PROUDLY PRESENTS
SKYLINE MOVIES
SHOW TIME
నేడే
విడుదల
WRITTEN & DIRECTED BY
MADHAN DAKSHINAMOORTHY
PRODUCER
KISHORE GARIKIPATI (G K)


ప్రపంచవ్యాప్తంగా
జూలై
11
విడుదల
IT BEGINS
A JAMES GUNN FILM
DC STUDIOS
సూపర్‌మ్యాన్
SUPERMAN
ONLY IN CINEMAS JULY 11
IN ENGLISH, HINDI & TELUGU
IN 3D & IMAX 3D
REAL D 3D Dolby Cinema IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


SMT.ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
T-SERIES
నేడే
విడుదల
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR

15 లోగా వనమహోత్సవం పూర్తి చేయాలి

కెరమెరి, జూలై 3(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవాన్ని ఈ నెల 15లోగా గ్రామాల్లో పూర్తి చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా సూచించారు. గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఎంపిక చేసిన ప్రదేశాలలలో, ప్రభుత్వపాఠశాలలు, వైద్యశాలలు, ఇతర కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటేందుకు స్థలాన్ని సిద్ధం చేయాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల రెండోదశ నిర్మాణాలు వీలైనంత త్వరగా మార్కింగ్ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేకాధికారి వెంకట్, ఏపీఓ మల్లయ్య, ఏపీఎం జగదీష్, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

ఆసిఫాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేసి పునఃప్రారంభించాలని, విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు దినకర్, కార్తీక్, తదితరులు ఉన్నారు.

ఆత్మీయ భరోసా ఇంకెప్పుడు?



- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్న అర్హులు
- జిల్లాలో 19,082 మంది గుర్తింపు

చింతలమానేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఈ వర్షాకాలానికి సంబంధించి పంటల సాగుకు భూమి కలిగిన ప్రతీ రైతుకు రాష్ట్రప్రభుత్వం రైతు భరోసా పేరిట ఎకరాకు ఆరువేల రూపాయల చొప్పున బ్యాంకు ఖాతాలకు పెట్టుబడి సాయం అందజేసింది. జిల్లాలో ఈ పథకం కింద 1.21 లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు. దీంతో రైతులు పంటల సాగులో బిజీగా మారారు. మరో వైపు భూమి లేని నిరు పేదలకు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. అర్హుల జాబితా ఇప్పటికే రూపొందించినా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేకపోవడంతో అర్హులు నిరాశ చెందుతున్నారు.

● జిల్లాలో ఇలా..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కోసం రేషన్ కార్డును యూనిట్‌గా సెంటు భూమి లేని నిరుపేదలను అర్హులుగా గుర్తించారు. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద కనీసం 20 పనిదినాలు పూర్తి చేసి ఉండాలి. అయితే కుటుంబంలో యజమానిగా ఎవరు ఉన్నా సదరు కుటుంబంలోని మహిళను ప్రభుత్వం లబ్ధిదారుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ లెక్కన జిల్లాలో 19,082 మంది అర్హులకు సాయం అందించాలని అధికారులు జాబితాను రూపొందించారు. మొదటి విడత నగదు సాయం ఆరు వేల రూపాయల నగదును ఈ ఏడాది జనవరి 26న జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ పథకాల అమలు కోసం మండలానికి ఓ గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. జిల్లాలో 15 గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు మాత్రమే నగదు జమ చేశారు. మిగిలిన అర్హులకు మార్చి 31 వరకు జమ చేస్తామని పలు మార్లు ప్రజాప్రతినిధులు ప్రకటించినా అమలుకు నోచుకోలేదు. రెండో విడత సాయం అందించాల్సిన సమయం వచ్చినా ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. అయితే ఇటీవల రైతుభరోసా నిధులు విడుదల చేయడంతో అర్హులు ఆత్మీయ భరోసాపై ఆశలు పెట్టుకున్నారు.

మండలాల వారీగా అర్హులు ఇలా..

మండలం	అర్హుల సంఖ్య	మండలం	అర్హుల సంఖ్య
చింతలమానేపల్లి	647	దహెగాం	1072
కౌటాల	1916	రెబ్బెన	976
బెజ్జూరు	1347	తిర్యాణి	1353
పెంచికలపేట	358	వాంకిడి	1570
సిర్పూర్(టీ)	1023	జైనూరు	1398
సిర్పూర్(యూ)	286	లింగాపూర్	695
కాగజ్‌నగర్	1482	కెరమెరి	2714

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ఆహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నదీం అహ్మద్‌తో కలిసి వంటశాల, నిత్యావసర సరుకుల నాణ్యత, బియ్యం నిల్వలు, వండిన ఆహారాన్ని, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, వంట సరుకులను క్రమ పద్ధతిలో అమర్చుకొని వంటలు వినియోగించాలని తెలిపారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థినులకు పోషకాహారం అందించాలని, విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గురుకుల పాఠశాల భవనం, ఆవరణ పరిశుభ్రంగా ఉండే విధంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులతో కలిసి వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలోని ఖాళీస్థలాల్లో పండ్ల మొక్కలు, పూల మొక్కలు నాటి సంరక్షించాలని, బెండకాయ, వంకాయ, బీరకాయ, టమాట ఇతర మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం గోవిందాపూర్ గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు గూడు కల్పిస్తుందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని బేసిమెంట్ స్థాయి వరకు పూర్తయిన నిర్మాణాలకు సంబంధిత బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను తర్వరగా చేయాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న బోజనం నాణ్యత, వంట పాత్రలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు.

అనంతరం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన సదరం శిబిరాన్ని సందర్శించి దివ్యాంగులకు అందిస్తున్న సేవలు, శిబిరం నిర్వహణ తీరును పరిశీలించారు. సదరం శిబిరానికి హాజరైన వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి పారదర్శకంగా ధ్రువపత్రాలు జారీచేయాలని ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన


వివరాలు నమోదు చేసుకుంటున్న ఎంపీడీవో

సిర్పూర్(టి), జూలై 3(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలోని అచ్చెల్లి, చింతకుంట, హీరాపూర్, భూపాలపట్నం గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల స్థితిగతులను ఎంపీడీవో సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర వివరాలను పరిశీలిం చారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

కాగజ్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను వివిధ సంఘాల నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్, సభ్యులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. తెలంగాణ ఉద్యమ కారుడు తాజ్‌బాబా ఘనంగా సన్మానించారు. భజరంగ్‌దళ్ కన్వీనర్ శివగౌడ్, ఆశోక్ లోయా తదితరులు కమిషనర్‌ను సన్మానించారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

- సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

బెజ్జూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బూత్‌స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో నకిలీ ఓటర్లు, చనిపోయిన వారిని గుర్తించి తొలగించాలని సూచించారు. 18 ఏళ్లు పైబడిన వారిని గుర్తించి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఫారం 6, 7, 8 ముఖ్యమైనవని వీటిలో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, డీటీ భీమ్లానాయక్, డీటీ జోగయ్య, సీనియర్ అసిస్టెంట్ సంతోష్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

రెబ్బెన: ఓటరు నమోదు ప్రక్రియను సిబ్బంది జాగ్రత్తగా నిర్వహించాలని ఆర్డీవో లోకేశ్వర్ సూచించారు. రెబ్బెన మండల కేంద్రంలోని కేకే గార్డెన్‌లో బీఎల్‌వోలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదులో బీఎల్‌వోలు ఫారం నంబర్ 6, 6ఎ, 8 నింపే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్య ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.


బెజ్జూరులో కురుస్తున్న వర్షం

బెజ్జూరులో భారీ వర్షం

బెజ్జూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇప్పటికే రైతులు వానాకాలం సీజన్ కోసం వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు విత్తనాలను నాటుకున్నారు. కురిసిన వర్షం, పత్తి పంట మొక్కలు ఎదగడానికి ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. తొలకిరి ప్రారంభంలో మోస్తారుగా కురిసిన వర్షాలకు రైతులు పత్తివిత్తనాలు నాటడం తో మొక్కల ఎదుగుదల నిలిచిపోగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరి కలగజేస్తోంది.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

ఆసిఫాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ గజానంద్‌కు వినతిపత్రం అందజేశారు. అయిదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు సంబంధించి సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

పీరీల సందడి

రెబ్బెన, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం పుంజుమేరగూడ గురువారం పీరీల సందడి నెలకొంది. గ్రామంలోని యువకులు పీరీలతో అగ్నిగుండం చుట్టూ అసైదూల ఆడారు. అలాగే గ్రామస్థులు పీరీలకు మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

పెంచికలపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంట్లపేటకు చెందిన మత్స్యకారుడు గిరిగుల గంగయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు పోతపల్లి మాజీ సర్పంచ్ చంద్రమౌళి ఐదువేల రూపాయల తక్షణ సహాయం అందజేశారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి


రైతులకు భూసార పరీక్షపత్రాలు అందజేస్తున్న ఏఈవో ప్రభావతి

కెరమెరి, జూలై 3(ఆంధ్రజ్యోతి): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏఈవో ప్రభావతి అన్నారు. గురువారం ఆమె గోయగాం గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ పలువురు రైతులకు చేశారు. ఈ సందర్భంగా రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా చేరాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని పేర్కొన్నారు. అలాగే పలువురు రైతులకు సంబంధించిన భూసార పరీక్షల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ వాహిని చారిటబుల్ ట్రస్ట్ మండల కో ఆర్డినేటర్ అభితాంజలి, రైతులు లక్ష్మణ్, కుసుమ్‌రావు, జానకీరామ్, సుజాత తదితరులు ఉన్నారు.

స్వయం పాలన కోసం పోరాడిన కుమరం భీం

కౌటాల, జూలై 3(ఆంధ్రజ్యోతి): గిరిజనుల స్వయం పాలన కోసం పోరాడిన తెలంగాణ ముద్దు బిడ్డ కుమరం భీం అని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం తెలిపారు. కౌటాల మండలం జనగాం గ్రామంలో కుమరం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంపాలన కోసం పోరాడిన తెలంగాణ ముద్దు బిడ్డ జల్ జంగల్ జమీన్ నినాదంతో గిరిజనుల హక్కుల కోసం పోరాడి నేటికీ ఆదివాసులకు తన పోరాటం స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ఇటీవల కుమరం భీం విగ్రహావిష్కరణకు తాను అందుబాటులో లేనని ఇప్పుడు గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.


కుమరం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కోనేరు కోనప్ప

రోడ్డుపై మొరం పోయించండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సావర్‌ఖేడ గ్రామస్థులు

ఆసిఫాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని సావర్‌ఖేడ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారిందని మొరం రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ గురువారం గ్రామస్థులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. దీంతో వెంటనే డీఎఫ్‌వోతో కలెక్టర్ మాట్లాడారు. ఈ మేరకు గ్రామస్థులకు మూడు లక్షల నిధులకు సంబంధించిన ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. మూడు లక్షల నిధులతో గ్రామానికి మొరం రోడ్డు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసీరాం, గ్రామస్తులు శ్యాంరావు, లక్ష్మణ్, నారాయణ, దత్తు, సోము తదితరులు ఉన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేత

కాగజ్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎల్లాగౌడ్ వాటర్ ట్యాంక్ వద్ద పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ లీకేజీ ఏర్పడినట్టు, దీంతో రెండ్రోజు ల పాటు నీటి సరఫరా వార్డు 7, 8, 0, 10, 11, 21, 22, 23, 24లో నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు కాగానే నీటి సరఫరాను పునరుద్ధరణ చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

దహెగాం, జూలై 3(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జి డీఈవో యాదయ్య అన్నారు. గురువారం దహెగాం మండలంలోని కేజీబీవీ విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీపీరావు కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాన్ని బోధించే విధానాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటకు ఉపయోగించే సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌వో, ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, తదితరులు ఉన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం

కౌటాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారులు ఎరువుల కొరతలేకుండా చూడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. గురువారం కౌటాల మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఎరువులు దొరక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ జిల్లా అధికారితో ఫోన్‌లో మాట్లాడి ఎరువులు కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌గౌడ్, విజయ్, రవి, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

కాగజ్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలో సబ్సిడీ విత్తనాలను గురువారం వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు కంది, జొన్న విత్తనాలు వంద శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన 'అరిగెల'


పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రాంచందర్‌రావును గురువారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని, ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశ పెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీగా పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ నాయకులకు రాంచందర్‌రావు ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాగజ్‌నగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్‌సిల్క్ ఎఫ్ కాలనీలో మహాంకాళి జాతర ఈ నెల 13న జరుగనున్న నేపథ్యంలో పారిశుధ్య పనులు చేపట్టాలని గురువారం తెలంగాణ ఉద్యమ కారుడు తాజ్‌బాబాతో పాటు కాలనీ వాసులు కమిషనర్ రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయ సమీపంలో పిచ్చి మొక్కలు పెరిగాయని, రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులుపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే సమస్యను పరిష్కరించేట్టు చూస్తామని తెలిపారు. ఈయన వెంట కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కులు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

చింతలమానేపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలంలోని లబ్ధిదారులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. డబ్బా గ్రామానికి చెందిన గుర్లె ఉజ్వలకు రూ.60 వేలు, గుర్లే నితీష్‌కు రూ.60లు, ఆడెపల్లి గ్రామానికి చెందిన బద్ది గంగారాంనకు రూ.25,500, కుంసె తిరుపతికి ఆరు వేల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్‌గౌడ్, విజయ్, నరసింహాచారి, శ్రీకాంత్, బాపురావు, శంకర్, సురేష్, శ్రీశైలం, సరన్, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి విడుదలైన చెక్‌ను సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు గురువారం నాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి విడుదలైన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు వరం పీఎం జుగా పథకం

జైనూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిరుపేద ఆదివాసుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పీఎం జుగా పథకం గ్రామీణ ప్రాంత గిరిజనులకు వరం అని జైనూర్ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మార్లావాయి, దుబ్బగూడ, పానాపటార్ తదితర గ్రామాల్లో గురువారం పీఎం జుగా పథకంపై అధికారులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసులకు పథకంపై అవగాహన కల్పించారు. కాగా పీఎం జుగా పథకాలపై గ్రామీణులకు తెలంగాణ సంస్కృతి టీం లీడర్ జాదవ్ మోహన్ నాయక్‌తి బృందం ఆట పాటలతోతి అవగాహన కల్పించారు మార్లావాయిలో గుస్సాడీల వేశం చూపరులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ ఎడ్డి, ఎంపీవో మోహన్, ఏపీఎం రాజకుమార్, ఏపీవో నగేష్, నాయకులు, మాజీప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

లింగాపూర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం అవుతుందని లింగాపూర్ ఎంపీడీవో రాంచందర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవం కార్యక్ర మంలో భాగంగా మండలంలోని ఎల్లా పటార్‌లో గురువారం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రయ్య, టీఏ సోరాజీ, ఎఫ్ఏ కిషన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అకాడి పేన్ సందడి

లింగాపూర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాములధరా గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మ ఆలయం వద్ద గురువారం ఆదివాసులు ఆకాడి పేన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వన దేవతకు ప్రత్యేక నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తగా వచ్చి గ్రాసం వల్ల పశువులకు ఎలాంటి హాని కలగకుండా చూడాలని వారు ప్రార్థించారు. రానున్న రోజుల్లో పంటలు బాగా పండాలని, వ్యాధుల నుంచి విముక్తి కల్పించాలని వారు వేడుకున్నారు.

మైనార్టీ గురుకుల అధికారిని తొలగించండి

జైనూర్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా మైనార్టీ గురుకులానికి నియమిపబడిన ఆర్ఎల్‌సీ శ్రీధర్‌ను జిల్లా నుంచి తొలగించాలని కోరుతు మైనార్టీ సంఘం జిల్లా నాయకుడు డాక్టర్ షేక్ జమీల్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్ కలెక్టర్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సదరు అధికారి అక్రమాలకు పాల్పడుతున్నారని వారు వినతి పత్రంలో ఆరోపించారు. ఇంతకుముందు శ్రీధర్ జిల్లాలో చేసినప్పుడు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయని ఆయనను తప్పించాలని డిమాండ్ చేశారు.